క్లుప్తంగా

నేడు మంత్రి రోజా పర్యటన

నగరి : నిండ్ర మండలంలో నిర్వహించే పలు కార్యక్రమాల్లో మంత్రి ఆర్కే రోజా బుధవారం పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు కొత్త ఆరూరులో నూతన బస్ షెల్టర్‌ను ఆమె ప్రారంభిస్తారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొంటారు.

ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్‌కు సన్మానం



ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్‌ను సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పాలసముద్రం : మండల అభివృద్ధి అధికారిగా పని చేస్తున్న ప్రేమ్‌రాజ్ కుమార్ వెదురుకుప్పం మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయనను ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంపీడీఓగా ప్రేమ్‌రాజ్ కుమార్ మండలంలో అభివృద్ధి పనులు, ప్రజలకు విశేష సేవలు అందించారని కొనియాడారు. అనంతరం ఆయనకు శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శులు ధరణి, సత్యనారాయణ, ఇందిర, శంకర్ పాల్గొన్నారు.

నేడు జగనన్నకు చెబుదాం

పుత్తూరు రూరల్: స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద ఏడీకే కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 10 గంటలకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు విధిగా హాజరు కావాలని కోరారు.

ఆలయ ఆవరణలో నాగుపాము



కార్వేటినగరం: కార్వేటినగరంలో వెలసిన వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలోకి మంగళవారం ఓ నాగుపాము రావడంతో భక్తులు పరుగులు తీశారు. దీనిపై పలువురు భక్తులు మాట్లాడుతూ ఆలయ ఆవరణలో పారిశుద్ధ్యం లోపం వల్లే విషపురుగులు సంచరిస్తున్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి పారిశుద్ధ్య లోపం లేకుండా చూడాలని, విషపురుగులు రాకుండా చూడాలని కోరారు.

పశుగ్రాసం దగ్ధం



పిడుగు పడడంతో కాలిపోతున్న గ్రాసం

శ్రీరంగరాజపురం : పిడుగుపాటుకు పశుగ్రాసం దగ్ధమైన సంఘటన మండలంలోని చిన్నబాపనపల్లిలో చోటు చేసుకుంది. బాధితుడు సుధాకర్ తెలిపిన వివరాల మేరకు.. ఇటీవల వరి పంట కోత కోయగా మిగిలిన పశుగ్రాసం, వేరుశనగ తీగలను నిల్వ చేశాడు. మంగళవారం సాయంత్రం కురిసే సమయంలో పడిన పిడుగుపాటుకు పశుగ్రాసం దగ్ధమైంది. సుమారు రూ.50 వేల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు సుధాకర్ తెలిపారు. ప్రభుత్వ అధికారులు ఆదుకోవాలని బాధితుడు కోరారు.

500 బారికేడ్స్ వితరణ

తిరుపతి క్రైం: ట్రాఫిక్, శాంతి భద్రతల నియంత్రణ కోసం కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఏసిటీ ఫైబర్ నెట్ డిజిటల్ సర్వీస్ సంస్థ ఆధ్వర్యంలో 500 బారికేడ్లు విరాళంగా అందజేశారు. మంగళవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్లో 10 లక్షల రూపాయలు విలువ చేసే 500 బారికేడ్లను జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డికి అందజేశారు. వీటిని ట్రాఫిక్, శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఉపయోగిస్తామని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసిటీ ఫైబర్ నెట్ సంస్థ ఏపీ హెడ్ సుబ్బారావు, మేనేజర్ మహేష్, న్యూస్ మేనేజర్ వేదనారాయణ జిల్లా ఏఎస్పీలు వెంకటరావు, కులశేఖర్ ఉన్నారు.

బస్సులు కండీషన్‌లో ఉంచాలి

తిరుపతి అర్బన్: వివిధ డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులను కండీషన్‌లో ఉంచాలని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన జిల్లాలోని 11 డిపోలకు చెందిన మెకానిక్‌లు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి అడిగిన మేరకు విడిభాగాలను అందిస్తున్నారని.. స్టోర్స్‌లో మిగిలి ఉన్నాయని వెల్లడించారు. అయితే కొందరు మెకానిక్‌లు వాటిని అమర్చడానికి నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కండీషన్‌లో ఉండే సర్వీసులను మాత్రమే రూట్‌పై పంపాలని స్పష్టం చేశారు. తెల్లవారుజామున మంచు కురుస్తున్న నేపథ్యంలో ఫాగ్‌లైట్లు(అధిక ఫోకస్ ఉండేవి)ను అన్ని సర్వీసులకు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డిపో మేనేజర్లు నిర్లక్ష్యంగా వహిస్తే ఊరుకోమని ఆయన స్పష్టం చేశారు.

ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు

- అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే
- ఎన్నికలప్పుడే చంద్రబాబుకు ప్రజలు గుర్తుకు వస్తారు
- ఆయన మాయమాటలను ఎవరూ నమ్మవద్దు
- వచ్చే ఎన్నికల్లో మరోమారు జగనన్నను ఆశీర్వదించండి
- మంత్రి ఆర్‌కే రోజా



మహిళలకు బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

పుత్తూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడా శాఖల మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. మంగళవారం సాయంత్రం పుత్తూరు మున్సిపాలిటి 11వ వార్డు గోవిందపాళెం సచివాలయ పరిధిలోని సీటీఆర్ నెత్తం, వీరప్పరెడ్డిపాళెం, ఆదిఆంధ్రవాడ, బత్తలవారి కండ్రిగ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రతి ఇంటికీ ప్రజలతో మమేకమయ్యారు. సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించి, స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కుల, మత, పార్టీలకు అతీతంగా అన్నివర్గాల వారికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీనే అన్నారు. గతంలో ఏ ప్రభుత్వ పాలనలో కూడా ప్రజాప్రతినిధులు ఇలా ప్రతి ఇంటి వద్దకు వచ్చి సంక్షేమ పథకాలు అందాయా? మీ అవసరాలు ఏమిటి అని అడిగిన దాఖలాలు లేవన్నారు. ఈరోజు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి గుమ్మం వద్దకు వచ్చి అందించిన సంక్షేమాన్ని, చేసిన అభివృద్ధిని ధైర్యంగా చెబుతోందని చెప్పారు. అవినీతికి తావులేకుండా వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలు ఇంటి గుమ్మం వద్దకే వస్తున్నాయని చెప్పారు. అవ్వా పెన్షన్ అందిందా? అక్కా చేయూత అందిందా? ఆరోగ్యశ్రీ వర్తిస్తోందా ? అమ్మఒడి చదువు అందిస్తోందా అంటూ ఆరా తీశారు. అందరూ అన్నీ అందుతున్నాయని సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ద్వారా లక్షల్లో లబ్ధి చేకూరుతోందని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల ప్రత్యేక నిధులు అందుతున్నాయని తెలిపారు. ఈ నిధులతో తక్షణ అవసరాలను సమకూర్చుకోవడం జరుగుతోందని వివరించారు.

99 శాతం హామీల అమలు..

2019 ఎన్నికల సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి హామీతో పాటు చెప్పని వాటిని కూడా సీఎం జగనన్న అమలు చేసి 99 శాతం నెరవేర్చినట్లు చెప్పారు. ఇలా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ప్రతి ఇంటా సంక్షేమం అందిస్తూ మహాత్మా గాంధీ కన్న కలలను సాకారం చేస్తున్న ఘనత మన జగనన్నకే దక్కిందన్నారు. ప్రజలకు వంద శాతం సంక్షేమం, అభివృద్ధి జరగాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. కానీ చంద్రబాబునాయుడుకు ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తుకు వస్తారని 2014 ఎన్నికల సమయంలో అనేక హామీలు గుప్పించిన చంద్రబాబునాయుడు, తర్వాత ప్రజలను మోసం చేసిన విషయం తెలిసిందే అన్నారు. ఈసారి కూడా అబద్ధపు హామీలు, అమలు చేయలేని వాటిని చెబితే నమ్మవద్దని ప్రజలకు సూచించారు. సీఎం జగనన్న ఇచ్చిన హామీలనే కాకుండా, చెప్పని పలు కార్యక్రమాలను సైతం చేశారని, ఇదీ వైఎస్సార్ కుటుంబ నైజమన్నారు.

ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధించాలంటే రాష్ట్రానికి జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి, చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, ఎంఎల్‌ఓ దిలీప్ మొదలియార్, కౌన్సిలర్లు జాన్‌కెనడీ, ఏకాంబరం, బాలాజీ, నాయకులు గజేంద్రనాయుడు, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంపై విమర్శలు అర్థరహితం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెనుమూరు(కార్వేటినగరం): గంగాధరనెల్లూరు నియోజకవర్గం అభివృద్ధి డిప్యూటీ సీఎం నారాయణస్వామితోనే సాధ్యమని జిల్లా కార్యవర్గ సభ్యులు దూది మోహన్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులతో కలిసి మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి నియోజకవర్గ అభివృద్ధితో పాటు అహర్నిశలు ప్రజాసేవే పరమావధిగా పని చేస్తుంటే ప్రతిపక్ష నాయకులు మాత్రం ఆయనపై పని గట్టుకుని అర్థరహిత విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. గత టీడీపీ హయాంలో నియోజకవర్గ అభివృద్ధిని గాలికొదిలేస్తే, వైఎస్సార్‌సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మంత్రి నారాయణస్వామి నిస్వార్థపరులని, ఆయనకు ఎక్కడా క్వారీలు, కాంట్రాక్టు వ్యాపారాలు లేవన్నారు. ప్రజల శ్రేయస్సే తన శ్రేయస్సుగా భావించే ఉప ముఖ్యమంత్రిపై నోరు ఉందని అర్థరహిత విమర్శలు చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. టీడీపీ నాయకులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా నియోజకవర్గంలో నారాయణస్వామి గెలుపును అడ్డుకోలేరన్నారు. కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మనోహర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దాము, బీసీ నాయకులు నీలం పండరీనాథ్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్ అంధకారం



మాట్లాడుతున్న ఎస్‌ఐ దస్తగిరి

కార్వేటినగరం: మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్ అంధకారం అవుతుందని ఎస్‌ఐ దస్తగిరి అన్నారు. మంగళవారం శ్రీలక్ష్మీనరసింహా కళాశాలలో మత్తు పదార్థాలకు అలవాటు పడితే కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో జీవితం అంధకారం అవుతుందని, అలాగే మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే మనిషి జీవితం సర్వనాశనం అవుతందన్నారు. అందువల్ల యువత మాదక ద్రవ్యాలకు, మత్తు వ్యసనాలకు దూరంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ దిలీప్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

శ్రీరంగరాజపురం : రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి అన్నారు. ×ఏపీకి జగనే ఎందుకు కావాలి¤ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండల కేంద్రంలో సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈనెల 9వ తేదీ నుంచి మండలంలోని ముద్దుకుప్పం సచివాలయం నుంచి ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని టీడీపీ, జనసేన పార్టీల మోసపూరిత హామీలను ప్రజలకు తెలియజేసి, జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించాలన్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ మణి, నాయకులు కాలప్ప, జనార్దన్, కుప్పయ్య, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ టీచరే.. అయినా స్కూల్ బాగుంది



పాఠశాల రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీదేవి

నగరి : ఏకోపాధ్యాయ పాఠశాలే అయినా నిర్వహణ చాలా బాగుందంటూ ఎంఈఓ శ్రీదేవి కితాబిచ్చారు. మంగళవారం ఆమె గుండ్రాజుకుప్పం మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించడాన్ని ఆమె గమనించారు. విద్యార్థులను నైపుణ్యాన్ని పరిశీలించిన ఆమె మాట్లాడుతూ పాఠశాలల నిర్వహణకు ప్రతి ఉపాధ్యాయుడు ఇలాంటి పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యాధికారి మోహన్‌కృష్ణ

పాలసముద్రం : ప్రస్తుతం వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల వ్యాపించే సీజన్ వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. మంగళవారం పాలసముద్రం పీహెచ్‌సీలో ఆశా నోడల్ ఆఫీసర్ సుశీల ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున గ్రామాల్లో అంటు వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో ఆశా కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి సీజన్ వ్యాధులకు ముందస్తుగా మందులు ఇవ్వాలని తెలిపారు. వర్షపు నీరు నిల్వలేకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మురళి, సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శుద్ధి చేసిన నీటినే సరఫరా చేస్తున్నాం



మహిళలకు వాటర్ ప్లాంట్ నిర్వహణను చూపుతున్న అధికారులు



మహిళలకు బహుమతులు అందిస్తున్న కమిషనర్

నగరి : శుద్ధి చేసిన నీటినే మున్సిపల్ పరిధిలో సరఫరా చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. మంగళవారం (జల్‌దివాళి) నీటిదీపావళి కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించారు. సత్రవాడ శివార్లలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద గల వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ వద్దకు విచ్చేసిన డ్వాక్రా మహిళలకు నీటి శుద్ధీకరణ ఎన్ని ప్రక్రియల ద్వారా జరుగుతుందో ప్రత్యక్షంగా చూపించారు. శుద్ధీకరణకు ఏ మేరకు ఖర్చు చేస్తున్నారో వివరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీటి శుద్ధీకరణ, సరఫరాపై ప్రత్యేక చొరవ చూపుతున్నాయని తెలిపారు.

అమృత్, డే నల్మ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నీటీ దీపావళి అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేశంలో 3 వేలకుపైగా వాటర్ ప్లాంట్లు ఉన్నాయన్నారు. 65 వేల ఎంఎల్‌డీని వాటర్‌ప్లాంట్ల ద్వారా శుద్ధీకరించి అందిస్తున్నారన్నారు. నీటి వినియోగంలో ప్రధాన పాత్ర మహిళలదే అని, వారికి నీటిని శుద్ధీకరించి అందించడం ఎంత శ్రమతో కూడిన ప్రక్రియో వివరిస్తే నీటి పొదుపు జరుగుతుందన్నదే ఈ కార్యక్రమ ఉద్దేశం అన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా 550 ట్రీట్‌మెంట్ ప్లాంట్లను మహిళలకు చూపించడం జరిగిందన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన మహిళలకు వాటర్ బాటిళ్లు, గ్లాసులను బహుమతిగా అందించారు. కార్యక్రమంలో డీఈ నరేష్, మెప్మా టీఎల్ఎం సునీత, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పక పాటించాలి



డీఎస్పీ శ్రీనివాసరావు

పుత్తూరు రూరల్: ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను టపాకాయల దుకాణాదారులు విధిగా పాటించాలని డీఎస్పీ వై.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో శాశ్వత లైసెన్స్ దుకాణాలు పుత్తూరు పట్టణ పరిధిలోని వినాయకపురం, వడమాలపేట మండలం తడుకు ఆర్ఎస్, నాగలాపురం, సత్యవేడులో ఉన్నాయని తెలిపారు. అలాగే తాత్కాలిక లైసెన్స్‌ల కోసం ఇప్పటి వరకు పుత్తూరులో 9 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. అనుమతి పొందిన తర్వాత ప్రభుత్వ ఆదేశాలను విధిగా పాటించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రదేశాల్లోనే షాపులను ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. షాపుల వద్ద ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయా మండల తహసీల్దార్లు, అగ్నిమాపక అధికారులతో కలిసి ఉమ్మడి తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీఐ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

టపాసుల విక్రయానికి అనుమతి తప్పనిసరి

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలో టపాకాయల విక్రయానికి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ రామాంజనేయులు సూచించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దీపావళి సందర్భంగా టపాకాయల విక్రయాలకు అగ్నిమాపక శాఖ నుంచి అనుమతి తప్పకుండా తీసుకోవాలని విక్రయదారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నివాసాలు లేని చోట ఊరి పొలిమేరలో టపాకాయలు విక్రయించుకోవాలని ఆయన సూచించారు.

నవజాత శిశు మరణాలను అరికడదాం

- జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు



ఆరోగ్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డాక్టర్ రవిరాజు



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డాక్టర్ రవిరాజు

శ్రీరంగరాజపురం : ప్రపంచ నవజాత శిశు రక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శిశు మరణాలను అరికట్టడానికి ప్రతి ఆరోగ్య కార్యకర్త కృషి చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ఆరిమాకులపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అలాగే రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లల ఆరోగ్యం బాగుండాలంటే ప్రభుత్వ ఆస్పత్రులలోనే ప్రసవాలు చేసుకోవాలని వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చిన్నపిల్లల ఆరోగ్య కోసం రాష్ట్రప్రభుత్వం తిరుపతిలో అత్యాధునిక వసతులతో సూపర్ స్పెషల్ ఆస్పత్రిని నిర్మించిందన్నారు. శిశువులో వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉంటుందని, తల్లిపాలను శిశువుకు అందించేవిధంగా ప్రేరణ కల్పించాలన్నారు. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం వరకు ఆరోగ్య సిబ్బంది మహిళలను పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ బాలసుబ్రమణ్యం, గౌరి, యమున తదితరులు పాల్గొన్నారు.

విషజ్వరాలపై అవగాహన కార్యక్రమాలు

కార్వేటినగరం: విషజ్వరాలపై గ్రామాల్లో విరివిగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా ఇమ్యునైజేషన్ వైద్యాధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బందితో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న జోరువర్షాలను దృష్టిలో ఉంచుకుని వైద్యసిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుద్ధ్య లోపం లేకుండా చూడాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉంటున్న ఆశా వర్కర్లు గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలకుండా ఎప్పటికప్పుడు నివేదికను వైద్య అధికారులకు అందించేలా చూడాలని సూచించారు. గ్రామాల్లో వర్షపునీరు నిల్వలు లేకుండా, వ్యర్థపదార్థాలు నివాస ప్రాంతాల్లో లేకుండా తొలగించేలా చూడాలన్నారు. డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి జ్వరాలతో పాటు, అన్ని రకాలైన వ్యాక్సిన్లు అందుబాటులో ఉండేవిధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అదేవిధంగా విధి నిర్వహణలో సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలకు గురికాక తప్పదన్నారు. ఆరోగ్యకేంద్రంలో వైద్యసిబ్బంది పగటి వేళతో పాటు రాత్రిపూట కూడా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ భువనేశ్వరి, డాక్టర్ హేమశ్రీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



గజేంద్ర బాబు

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి ఎం.గజేంద్ర బాబు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో 56వ గ్రంథాలయ వారోత్సవాలను ఈ నెల నవంబర్ 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వారంరోజుల పాటు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు, వక్తృత్వపు పోటీలు, డ్రాయింగ్, మ్యూజికల్ చైర్స్ తదితర పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వారోత్సవాల ముగింపు రోజు 20వ తేదీ పోటీల్లో గెలుపొందిన వారికి ముఖ్య అతిథులచే బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. గ్రంథాలయ వారోత్సవాలకు విద్యార్థులు, పాఠకులు, పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

పేదవిద్యార్థులకు నాణ్యమైన విద్య



జీడీ నెల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో పర్యటిస్తున్న జిల్లా అధికారులు

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీపీ పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్రరావు, జిల్లా సర్వశిక్షాఅభియాన్ ప్రాజెక్ట్ అధికారి వెంకటరమణా రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల బంగారు భవిష్యత్ కోసం అమ్మఒడి, జగనన్న గోరుముద్ద పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. తద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యా ప్రమాణాలు అందుతున్నాయని, నాడు–నేడు పథకం ద్వారా కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలు అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తున్నాయని తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలను పరిశీలించారు. పాఠశాల వెనుక భాగంలో రెండు ఇంకుడు గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయని గుర్తించి, జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వెంటనే వాటిని పూడ్చేయాలని హెచ్ఎం హేమలత, ఇన్‌చార్జ్ హెచ్ఎం దినకర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్, ఎంఈఓ ఆంజనేయులు శెట్టి, ఏపీఎం శ్రీనివాసులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి అంజాద్ బాష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ ఆరోగ్య భద్రత



పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కార్వేటినగరం: రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మనోహర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గంగుపల్లి సచివాలయ ఆవరణలో సర్పంచ్‌లు అమ్ములు, అరుణ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీఎం జగనన్న తన పాలనలో ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ఇటీవల ఫ్యామిలీ ఫిజీషియన్, తాజాగా జగనన్న ఆరోగ్య సురక్ష ప్రవేశ పెట్టి ప్రజల ఆరోగ్యానికి పూర్తి భరోసా ఇస్తున్నారని గుర్తు చేశారు. స్థానికంగా నిర్వహించే వైద్య శిబిరాల్లో స్పెషలిస్టు వైద్యులతో వైద్యం, అవసరమైన పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు అందిస్తున్నారని తెలిపారు. మెరుగైన వైద్యం అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేసి కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందిస్తున్న జగనన్నకు ప్రజలు రుణపడి ఉండాలన్నారు. అలాగే అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసి పౌష్టికాహారం స్టాల్స్ చూపరులను ఎంతో ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎంపీడీఓ నీలకంఠేశ్వర్ రెడ్డి, ఈఓపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, డీడీఓ సురేంద్రరెడ్డి, కార్యదర్శి కుమార్, ఐసీడీఎస్ పర్యవేక్షకులు భాగ్యలక్ష్మి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్, శివ, బీసీసెల్ మండల అధ్యక్షుడు నీలపండరినాథ్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు దాము, రామయ్య పాల్గొన్నారు.